www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 30 | జూన్ | 2026
పేజీలు : 8

## బిల్లు ఇవ్వలేదని బడికి తాళం




-ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులతో గుత్తేదారు ఆందోళన

2 లో

## రైతు ఆశీర్వాద సభ వాయిదా



**-రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం**
**ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/చింతకాని :** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరుణ దేవుడు కూడా ముందే ఆశీర్వదించాడని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం చింతకాని మండలం జగన్నాధపురంలో ఈ నెల 30న నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభా వేదిక లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భట్టి మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఈ కారణంతో రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుడదన్న ఉద్దేశ్యంతో సభా నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన తెలిపారు. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి క్యాబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించనట్లు పేర్కొన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా

మిగతా 2లో..

## సారూ.. ఇలా అనుకుంటున్నారు..!


(ఫైల్)

వర్షాకాలంలో వ్యవసాయ భూముల్లో రైతు ఆశీర్వాద పెట్టాలన్న ఆలోచన సరికాదు. జూన్ మాసం చివరిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారం ఇచ్చినా వాతావరణ శాఖాధికారులు చెప్పింది ఎప్పుడు నిజమైంది వర్షం చెప్పితే ఎండ, వాతావరణం పొడిగా ఉంటుందంటే వర్షం రావడం ఖాయం అని మీరు నమ్మినట్లు ఉన్నారు. కానీ ఈసారి ఎందుకో నిజమై మన సభ రద్దయింది.

రైతులకు కౌలు ఇచ్చి, కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేయడం కంటే మధిరలో కానీ, మరే పట్టణ ప్రాంతంలో సభ ఏర్పాటు చేస్తే సభ రద్దు అయ్యేది కాదుగా. వారం రోజుల శ్రమ, ఏర్పాట్లు ఒక్క వర్షం దెబ్బకు పనికి రాకుండాపోయాయి.

ఆశీర్వాద సభలో రైతు భరోసా విడుదల చేయటమే ఎజెండా అయితే మీరు పూర్తి స్థాయిలో పెట్టుబడి సహాయం అందించి ఎక్కడి నుంచైనా ఆశీర్వదించవచ్చు అన్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు ఏడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే సీతారామ ప్రాజెక్టుకు ముందుకు సాగడం లేదు. ఇంకా సుమారు తొమ్మిది వేల కోట్లు ఖర్చు చేయాల్సిన ప్రాజెక్టు ఈ ఏడాది కేటాయించింది రూ. 360 కోట్లే. ఈ రీతిన కేటాయింపులు జరిపితే ఎన్నాళ్లకు ఈ ప్రాజెక్టు పూర్తి అవుతుంది. తర్వాత జరిగే సభలోనైనా స్పష్టత ఇస్తారా.

యాప్ ద్వారా యూరియా అందిస్తామన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులకు ఇబ్బందులు లేకపోవచ్చునేమో కానీ కౌలు రైతులు పడుతున్న ఇబ్బందులను ఆశీర్వాద సందర్భంగా ఒక్కసారైనా సమీక్షించారా.

అన్నింటికి మించి రైతు భరోసా ఎన్ని ఎకరాలకు రైతుల ఖాతాల్లో జమ చేస్తారోనన్న సంశయం ఉంది. యాసంగిలో రెండు ఎకరాలకే రైతు భరోసా అందించారు. ఈ దఫా వర్షం కాలం పంటకు మొత్తం అంటే అంతకు వేస్తారా లేక మళ్లీ ఎకరాల లెక్క కోతలు ఉంటాయా.

వరుణ దేవుడు ఆశీర్వదించారన్నారు అలాగే సాగులో ఉన్న మొత్తం భూమికి భరోసా అందించి రైతులను ఆశీర్వదించండి.

-ప్రజాపక్షం/ఖమ్మం

## కౌలు రైతుల యూరియా తిప్పలు..!




**-యాప్‌తో రైతులకు తీవ్ర ఇబ్బందులు**
**-ఒక బుకింగ్‌కు 2 బస్తాల నిబంధనలతో ఇక్కట్లు**
**-ప్రభుత్వం స్పందించాలని రైతన్నల వేడుకోలు**

**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాల ప్రభుత్వ పథకాలు అందక సతమతమవుతున్న వీరిపై ఇప్పుడు యూరియా పిడుగు పడింది. ప్రభుత్వ నిబంధనలు, సాంకేతిక సమస్యల కారణంగా కౌలు రైతులు బ్లాక్ మార్కెట్ నుంచి యూరియా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. పట్టాదారు పాస్‌బుక్ ఉంటేనే యూరియా ఇస్తామని అధికారులు స్పష్టం చేయడంతో బయటి నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. విచ్చలవిడి యూరియా వినియోగాన్ని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన నూతన నిబంధనలు సాధారణ రైతులతో పాటు కౌలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కేంద్ర ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫార్మర్స్ రిజిస్ట్రీలో కౌలు రైతులను విస్మరించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్‌లోనూ పట్టా రైతు మొబైల్ లింక్ వచ్చే ఓటీపీని కంపల్సరీ చేశారు. అంతేకాకుండా ఒక బస్తా తీసుకున్నాక మరొక బస్తా ఇవ్వాలంటే కనీస కాల వ్యవధి 15 రోజులు

మిగతా 2లో..

## యంగ్ ఇండియా స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి కీర్తి పతాక



**-విద్యా హబ్‌గా మారనున్న కొత్తగూడెం జిల్లా కేంద్రం**
**-శరవేగంగా 25 ఎకరాల భారీ విస్తీర్ణంలో నిర్మాణాలు**
**-నిర్మాణ పనులను పరిశీలించిన ఎంఎల్‌ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు కానున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి ఒక కీర్తి పతాక అని, ఈ స్కూల్ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా కేంద్రం గొప్ప విద్యా హబ్‌గా మారబోతోందని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకూ ఒకే క్యాంపస్‌లో

మిగతా 2లో..

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

**(మొదటిపేజీ తరువాయి)** అనుకున్న ఈ కార్యక్రమాన్ని రైతుభరోసా పంపిణీ పూర్తయిన పిదప మరింత ఉత్సాహంగా రైతు ఆశీర్వాద సభ పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని భట్టి స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజులు ముందస్తు అంచనాలు తీసుకుందని, ఈ నెల 3,4 తేదీల వరకు వర్ష సూచన ఉండటంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరలో ఈ సభ నిర్వహించేలా ప్రణాళిక లు సిద్ధం చేసి సభ విజయవంతానికి కృషి చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ నాటి పదేళ్ల పాలనలో కేవలం ఉప ఎన్నికల సమయంలోనే రైతు బంధు విడుదల చేస్తే కాంగ్రెస్ రెండున్నరేళ్లలో 36వేల కోట్ల రైతు భరోసా ఇచ్చిందని, కేసీఆర్ అవలంభించిన రైతు వ్యతిరేక విధానాలతో వారి ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళా ఖాతంలో కలిపారని మంత్రి తుమ్మల అన్నారు. పదేళ్ల బారాస పాలనల ఆర్థిక విధ్వంసం సృష్టిస్తే ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమంతో లక్షల ఎకరాల్లో రైతులు పంట దిగుబడి పెరిగిందన్నారు. పంట దిగుబడి పెరిగినా దేశంలో ఏరాష్ట్రంలో మద్దతు ధరకు పంట కొనుగోలు చేయకపోయినా ఎమ్‌ఎస్‌పీ అమలు చేసి రైతులకు మద్దతు ధర తో పంట కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణానే అన్నారు. మంగళవారం శిల్పారామం లలిత కళాతోరణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామన్నారు. తొమ్మిది రోజుల పాటు ఈ వానా కాలం రూ. 9వేల కోట్లు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నిధుల విడుదల తర్వాత రైతు ఆశీర్వాద సభ చరిత్రలో నిలిచిపోయేలా జగన్నాధపురంలో జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ , జిల్లా కలెక్టర్ దివాకర టియస్, సీపీ సునీల్ దత్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, హస్త కళల చైర్మన్ నాయుడు సత్యం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ఖమ్మం, మత్తేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు హనుమంతరావు, అంబటి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్ రెడ్డి, తుపాకుల యలగొండ స్వామి మత్తేపల్లి , జగన్నాధపురం సర్పంచ్‌లు కంచం ద్రౌపది, తాళ్ళూరి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### యంగ్ ఇండియా స్కూల్..
## కొత్తగూడెం నియోజకవర్గానికి కీర్తి పతాక





**(మొదటిపేజీ తరువాయి)** విద్యను అందించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ ప్రాజెక్టు కింద కొత్తగూడెం క్యాంపస్‌లో రూ 200 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత అత్యాధునిక హంగులతో ఈ స్కూల్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. 25,475 ఎకరాల భారీ విస్తీర్ణంలో 5,38,246 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ భారీ నిర్మాణాల్లో అకడమిక్ బ్లాక్, జూనియర్, సీనియర్ హాస్టల్ బ్లాకులు, డైనింగ్, కిచెన్‌లతో పాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఈ సరి కొత్త స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకొని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ సెంటర్లు, సైన్స్ ల్యాబ్‌లు, 5000 పైగా పుస్తకాలతో కూడిన డిజిటల్ లైబ్రరీలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల శారీరక , మానసిక వికాసం కోసం 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, క్రికెట్ గ్రౌండ్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ కోర్టులను ప్రత్యేకంగా నిర్మిస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా పర్యావరణ హితంగా ఉండేలా సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, సౌర, పవన్ విద్యుత్ వ్యవస్థలను, నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానాలను ఇక్కడ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ఇప్పటికే రోడ్లు, బ్రిడ్జీలు, అండర్ బ్రిడ్జీలు, ఓవర్ బ్రిడ్జీలు, ఔటర్ రింగు రోడ్డు కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరి కొన్నింటికీ మంజూరు లభించిందని తెలిపారు. అన్ని కులాల వారికి 17 కమ్యూనిటీహాల్‌లు మంజూరు చేయడం జరిగిందని, ఎయిర్పోర్టు, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, క్రీడామైదానాలు, జిమ్ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విలేకర సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, డీఈవో వాసంతి, పాఠశాలల భవనాల పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు హేమచంద్రరావు, రాజగోపాల్, నాయకులు వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, కార్పొరేటర్లు ఎర్రబెల్లి శంకర్, దుర్గ, సుధాకర్, పద్మ, ఆకాంక్ష, హిమశ్రీ, బండి నర్సింహ, విజయ్, తులశమ్మ, సహేరా, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతుల యూరియా తిప్పలు..!



**(మొదటిపేజీ తరువాయి)** అనే నిబంధన పెట్టారు. దీంతో కౌలు రైతులు ఓటీపీ కోసం పట్టాదారు రైతులను బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సైబర్ క్రైమ్, భూమి హక్కులు, ఇతర పథకాల ప్రయోజనాలు పోతాయన్న భయంతో భూ యజమానులు ఓటీపీలు చెప్పడానికి నిరాకరిస్తున్నారు. దీంతో 5 నుంచి 10 ఎకరాల వరకు సాగు చేసే రైతులు అయిదు నుంచి పది సార్లు బుక్ చేయాల్సి వస్తోంది. ఇన్ని సార్లు బుకింగ్ చేయటం, యూరియా కోసం పలు మార్లు వెళ్లాల్సి రావడంతో వ్యవసాయ పనులు మానుకోవాల్సి వస్తోందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు బస్తాల సీలింగ్ ప్రకారమే రైతులకు వచ్చే కోటా యూరియాను సీజన్ మొత్తానికి ఒకే సారి బుకింగ్ చేసుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. యూరియా యాప్‌ని రద్దు చేసి గతంలో లాగ యూరియా, డిఏపి, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అవసరమైన మేర అందించాలని, ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు ఇచ్చే రైతు భరోసాను అందించాలని, కౌలు రైతులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డులను ఇచ్చి, వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సమస్యపై స్పందించాలని రైతన్నలు వేడుకొంటున్నారు.

### రైతులకు పాత పద్ధతిలో పంపిణీ చేయాలి:
### సిపిఐ మండల కార్యదర్శి తోగటి కుమార్




రైతులకు పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలని సిపిఐ మండల కార్యదర్శి తోగటి కుమార్ అన్నారు. స్మార్ట్ ఫోన్‌లతో రైతులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదని, రైతులందరూ స్మార్ట్ ఫోన్లు వాడరని , వారు బుకింగ్ చేసుకోలేరని తెలిపారు. పాత పద్ధతిలోనే పీఏసీఎస్ సొసైటీలు, ఎరువుల దుకాణాల ద్వారా యధావిధిగా యూరియాను సరఫరా చేయాలని, ప్రభుత్వం సీజన్‌కు కావాల్సిన యూరియాను ముందే స్టాక్ పెట్టుకోవాలన్నారు. యూరియా సరఫరాను పాత పద్ధతిలో యధావిధిగా అందించాలని, లేదంటే ఆందోళనలు తప్పవని డిమాండ్ చేశారు.

## బిల్లు ఇవ్వలేదని బడికి తాళం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మన ఊరు మన బడి కార్యక్రమంలో పాఠశాల భవనాలకు మరమ్మతులు చేస్తే చెల్లింపులు జరపలేదని గుత్తేదారు పాఠశాల గేటుకు తాళం వేశారు. అంతేకాకుండా తనకు బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోల్ బాటిల్‌తో ఆందోళనకు దిగాడు. ఈ ఘటన ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దానవాయిగూడెంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... గత ప్రభుత్వ హాయాంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా దానవాయిగూడెం ప్రభుత్వ పాఠశాలకు రూ. 26 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టానని ఇంకా రూ. 13 లక్షల బిల్లులు రావాల్సి ఉందని గుత్తేదారు అయోధ్య తెలిపారు. అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో పాఠశాల గేటుకు తాళం వేయాల్సి వచ్చిందన్నారు. గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బయట ఉండిపోయారు. గుత్తేదారు అయోధ్య కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోల్ బాటిల్ పట్టుకుని నిరసనకు దిగారు. తనకు వెంటనే బిల్లులు చెల్లించాలని లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానంటూ హెచ్చరించారు. విషయం తెలిసిన అర్బన్ ఎంఈవో శైలజలక్ష్మి పోలీస్ సహాయంతో పాఠశాల వద్దకు వెళ్లారు. గుత్తేదారుతో మాట్లాడి తాళం తీయించి యధావిధిగా తరగతులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. బిల్లుల చెల్లింపు విషయమై శైలజ లక్ష్మి ని ప్రశ్నించగా మన ఊరు మన బడి పథకం క్రింద రూ.16 లక్షల పనులను గుత్తేదారు చేశాడని ఇందులో రూ. 10లక్షలు చెల్లించామని మరో ఆరు లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలిపారు.

## స్టాంపుల కోసం ప్రజల ఇబ్బందులు

-నాలుగు రోజులుగా పనిచేయని ఆన్‌లైన్ సైట్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నాలుగు రోజులుగా స్టాంపు విక్రయాలకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్ పని చేయకపోవడంతో ప్రజలు, స్టాంప్ విక్రేతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వర్ సమస్య కారణంగా నాలుగు రోజులుగా స్టాంపుల జారీ పూర్తిగా నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్లు, అఫిడవిట్లు, ఒప్పంద పత్రాలు తదితర అత్యవసర పనులు వాయిదాపడ్డాయి. స్టాంపుల కోసం వస్తున్న ప్రజలు గంటల తరబడి వేచి చూసినా పని జరగక నిరాశతో వెనుదిరిగారు. స్టాంపు విక్రేతలు కూడా సైట్ పనిచేయకపోవడంతో వ్యాపారాన్ని నిర్వహించ లేక ఇబ్బందులు పడ్డారు. రోజు వారి లావాదేవీలపై కూడా ప్రభావం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రానికి కూడా సమస్య పరిష్కారం కాలేదని వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రజలు, స్టాంప్ విక్రేతలు సంబంధిత అధికారులను కోరారు.

## అజ్మీర ఈరి మృతికి సంతాపం



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలోని అప్పాయిగూడెం గ్రామానికి చెందిన అజ్మీర వీరన్న తల్లి అజ్మీర ఈరి అనారోగ్యంతో మృతి చెందగా, జిల్లా కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా ఈరి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హిరాలాల్, అప్పాయిగూడెం సర్పంచ్ ప్రవీణ్ కుమార్, గంగారం తండా సర్పంచ్ కిరణ్ కుమార్, అప్పాయిగూడెం మాజీ సర్పంచ్ అజ్మీర అరుణ, జర్నలిస్ట్ బానోత్ బాలూనాయక్, అజ్మీర సంతోష్, హన్మ, తదితరులు పాల్గొన్నారు.

### రాములు నాయక్ నివాళి...



అప్పాయిగూడెం పంచాయితీ భిక్యతండాకు చెందిన మండల మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న తల్లి అజ్మీర ఈరి అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం వైరా మాజీ ఎంఎల్‌ఏ లావుడియా రాములు నాయక్ వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ దారావత్ మంగీలాల్, ఏఎంసీ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు భూక్య రాంకిషోర్, జర్పుల ప్రసాద్, బానోతు కోటి, గుగులోత్ హరు, వాంకుడోత్ కరణ్ సింగ్, వాంకుడోత్ విజయ్, జూపల్లి రాము, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## జర్పుల జాంగ్లీకి నివాళి



**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండా గ్రామ పంచాయితీ 5వ వార్డుకు చెందిన జర్పుల జాంగ్లీ వృద్ధాప్యంతో మృతి చెందగా, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈకార్యక్రమంలో 5వ వార్డు సభ్యులు జర్పుల సంధ్య, సందీప్ కుమార్, జర్పుల కుమార్, గణేష్, దేస్యా, లాలూ, సంజు, గిరి ప్రసాద్, సాయి, సోమ్లా, వీరన్న, వినోద్, విక్రమ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ దోపిడీతో తెలంగాణ విధ్వంసం



**- రూ.లక్ష కోట్లు అప్పులు మిగిల్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం**
**- జమలాపురం వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఉపముఖ్యమంత్రి దంపతులు**



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** బీఆర్ఎస్ పాలకులు ఆర్థిక, సామాజిక దోపిడీకి పాల్పడి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క మండిపడ్డారు. మండల పరిధిలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం సతీ సమేతంగా దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి దంపతులకు వేద పండితులు, అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ..ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మాధవ సేవ, మానవ సేవ అనే మన సంస్కృతి విలువలతో ముందుకు సాగుతోందని అన్నారు. బీఆర్ఎస్ తమ కుటుంబం కోసం, తమ నలుగురి కోసం అన్నట్లుగా పదేళ్లు చేశారని ఆరోపించారు. రాష్ట్ర సంపదను నలుగురు కుటుంబ సభ్యులు దోచుకొని ఆ డబ్బుతో నాలుగు చానళ్లు, పత్రికలు సామాజిక మాధ్యమం ద్వారా అబద్దాలు పోగేసి ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వానికి అప్పగిస్తే నిధులన్నీ కరిగించి మరో రూ.8లక్షల కోట్లు అప్పులు మిగిల్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలో 1.06కోట్లు కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, మార్కెట్‌లో కిలో రూ.5055 ధర ఉన్నప్పటికీ పేద కుటుంబాలలో ఏ ఒక్కరూ కూడా నాణ్యమైన ఆహారానికి దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రతీ వ్యక్తికి 6కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ఆరోగ్యశ్రీ అస్తవ్యస్తంగా మారి పేదల ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని, దాన్ని మారుస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని 5లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం కేఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేమిరెడ్డి సుధాకర రెడ్డి, మధిర ఏఎమ్‌సీ ఛైర్మన్ బండారు నర్సింహారావు, కంచర్ల వెంకట నర్సయ్య, జమలాపురం సర్పంచి తుళ్లూరు నిర్మల కుమారి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, అనుమోలు, వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**-అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బోనకల్ మండలం ఆళ్లపాడుకు చెందిన ఎం.శ్రీను గతంలో తనకు దివ్యాంగుల పెన్షన్ వచ్చేదని సదరం సర్టిఫికెట్ చేసినప్పటికీ ఆగిపోయిందని పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరంలోని 44వ డివిజన్‌కు చెందిన ఎస్‌కె నాజియా తన కుమార్తెకు తలసేమియా వ్యాధి ఉందని సదరం సర్టిఫికెట్ మంజూరు చేసి దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఏన్కూరు మండలం హిమామ్ నగర్ గ్రామ పంచాయతీ ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాథమికోన్నత పాఠశాల ఆక్రమణను తొలగించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం కేశావాపురంకు చెందిన చాగంటి శ్రీదేవి సర్వే నెం. 591/1/2లో రెండు ఎకరాల భూమి ఉందని దానిని సాగు చేసుకోనివ్వకుండా అక్రమంగా అడ్డుకోవడం జరుగుతుందని ధరణిలో సర్వే నెంబర్ మిస్ మ్యాచ్ అయిందని దానిని పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్లు సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన గోపాలరావు

**-ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎంఈవో రాములు**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఏ పాఠశాలలో పనిచేసిన విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేసి వృత్తికే వన్నె తెచ్చిన ఉపాధ్యాయుడు లేడిబోయిన గోపాలరావు అని ఎంఈవో రాములు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గణేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో లేడిబోయిన గోపాలరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గోపాలరావు కళావతి దంపతులను శాలువలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఎనిమిదేండ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా ఇదే పాఠశాలలో పనిచేస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. గోపాలరావు ఏ పాఠశాలలో పనిచేసినా ఆ పాఠశాలలో విద్యార్థుల అభ్యున్నతితో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేసే వారన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ లు మాట్లాడుతూ తాను పనిచేసే పాఠశాలలో విద్యా బోధనకే పరిమితం కాకుండా దాతల సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారన్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగులు, టై, షూ వంటి అవసరాలను కూడా దాతల సహకారంతో సమకూర్చారన్నారు. లేడిబోయిన గోపాలరావు అందించిన సేవలను గుర్తించి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా 2024లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించి సత్కరించారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం బి. శ్రీమన్నారాయణ, సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పవిత్ర, అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ ఎం. సుశీల, సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు, దొండపాటి రమేష్, ఎస్టియు జిల్లా మాజీ అధ్యక్షులు బి. మాధవరావు, ఎస్‌జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కరామత్ అలీ, ఎస్‌జిపిఏటి విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ పెదమాళ్ల సత్యం, మున్నూరు కాపు సంఘం నాయకులు ఆకుల గాంధీ పాల్గొన్నారు.

## ‘గో టూ విలేజ్ ’ కార్యక్రమం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా నాయకులు కొలికపొంగు వెంకటరాములు, గూడూరు వీరస్వామి ఆధ్వర్యంలో సోమవారం కుట్టకూరు, ఎడవల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో ‘ గో టూ విలేజ్ ’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతీ కుటుంబం తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని, విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వచ్చే నెల 7వ తేదీన నిర్వహించనున్న మన జాతి పండుగను ఘనంగా జరుపుకోవాలని, ప్రతీ గ్రామంలో మన జాతి జెండాను ఎగురవేసి జాతి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన సొసెటీ వారోత్సవాలు




**ప్రజాపక్షం/ముదిగొండ:** సహకార సంఘం(సొసైటీ) వారోత్సవాలను సోమవారం సొసైటీ ఛైర్మన్ తుపాకుల యలగొండ స్వామి కార్యాలయంలో సొసైటీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సిబ్బంది, రైతులతో కలిసి సహకార ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ప్రసాద్, సిబ్బంది దీపిక, జానీమియా, శ్రీను, రమ్య, రైతులు పాల్గొన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** కొడుకు లేని లోటు తీరుస్తూ తండ్రికి తల కొరివి పెట్టి కన్న తండ్రి రుణం తీర్చుకుంది ఓ కూతురు. కుమార్తె కన్న తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం ఉప్పల చిలక గ్రామంలో వేల్పుల సీతయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేని మృతుడు సీతయ్యకు పెద్ద కుమారుడు స్థానంలో అతని పెద్ద కుమార్తె మానస అన్ని తానై అంత్యక్రియలు నిర్వహించింది. మృతుడు వేల్పుల సీతయ్య గతంలో రెండు పర్యాయాలు ఉప్పల చిలక గ్రామానికి ఉప సర్పంచ్ గా పనిచేశారు.

## రైతు సంక్షేమానికి చేయూత

**-ఘనంగా సహకార వారోత్సవాలు**




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సహకార సంఘం ద్వారా రైతు సంక్షేమానికి చేయూతనందిస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు తెలిపారు. సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార జెండాను ఛైర్మన్ రావూరి సైదుబాబు ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. పంటల రుణాలతో పాటు ఇతర రుణాలను కూడా అందిస్తున్నామన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు రుణాలతో పాటు, బంగారు రుణాలు, సేవింగ్స్ ఖాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు కూడా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు. వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, డైరెక్టర్లు జోగు అనిత, గోపగాని ముత్తి లింగయ్య, సుగుణ, సొసైటీ కార్యదర్శి అయితగాని తిరుపతిరావు, సిబ్బంది, రైతులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. సోమవారం మమత ఆసుపత్రి రోడ్డులోని పసుమర్తి ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో పదవ తరగతిలో అన్ని మండలాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు పసుమర్తి సీతాచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి గోళ్ల రాధాకృష్ణమూర్తి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. విద్యా కమిటీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించిన నిర్వాహకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో చారుగుండ్ల నర్సింహామూర్తి, గుర్రం సీత, కొండా శ్రీధర్, పసుమర్తి రాంచందర్‌రావు, ప్రవీణ్, ఉపాధ్యక్షులు వేమిశెట్టి మోహన్‌దాస్, కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు, వెచ్చా రామకృష్ణ, దాచేపల్లి రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అరికట్టాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలను అరికట్టి, రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం పాల్వంచ డివిజన్ కార్యదర్శి నకిరకంటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ములకలపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి ఎర్రగొర్ల రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ యూరియా యాప్‌ను రద్దు చేసి, రైతు భరోసా సకాలంలో చెల్లించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐయూకేఎస్ నాయకులు మడకం యర్రయ్య, కారం బాలరాజు, రమేష్, పీఓడబ్ల్యూ నాయకురాలు మొడియం శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, పురుగు మందులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ఇల్లందు:** నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులను అరికట్టడంతో పాటు రైతు భరోసా సకాలంలో చెల్లించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు సకాలంలో అందించాలన్నారు. యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను సరసమైన ధరలకు అందించాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేసి వ్యవసాయ ఇన్‌పుట్సష్ అందించాలని, అలాగే ధాన్యం కొనుగోళ్లలో క్వింటాకు 10కిలోల తరుగు విధాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ ధాన్యం బకాయాలు చెల్లించి రైతు భరోసా అందించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఇస్లావత్ కోటేష్, చిత్తలూరి బాలస్వామి, సర్వే తండా గ్రామ కార్యదర్శి గంగావతి పికిన, అజ్మీర పాపన్న, వెంకన్న, కృష్ణ, శ్రీను, లక్ష్మ య్య, బిచ్చ, భారతి, బద్రు పాల్గొన్నారు.

## ప్రొడక్షన్ రిలేటెడ్ పే పిఆర్‌సి విడుదల చేయాలి



**ప్రజాపక్షం/మణుగూరుః** బొగ్గు గనులు అధికారుల సంఘం సింగరేణిలో అధికారులకు తక్షణమే కోల్ ఇండియాలో అమలు చేస్తున్న పేఅబ్రిడేషన్ అమలు చేయాలని మరియు గత రెండు సంవత్సరాల ప్రొడక్షన్ రిలేటెడ్ పే పిఆర్పి వెంటనే విడుదల చేయాలని అఖిల భారత బొగ్గు గనులు ఆఫీసర్స్ అసోసియేషన్ మణుగూరు అధికారుల సంఘం తరపున మణుగూరు లోని అధికారులు రిలే నిరాహార దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ రిలే నిరాహార దీక్షలు ఈ నెల 13 వరకు కూడా కొనసాగుతాయని మరియు యాజమాన్యం స్పందించకపోతే తీవ్రమైన పోరాటాలకు వెనకాడ మని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారుల సంఘం ముఖ్య కార్యదర్శి మదన్ నాయక్, రమణారెడ్డి, రామ్ శంకర్, శోభన్ బాబు సాయిల సురేష్ కుమార్, సర్వర్ నభి, కిషన్ రామ్, తోలం మధుసూదన్, డి. రమేష్ బాబు, సుదర్శన్ రెడ్డి, సీతారాం బాబు, జె. శ్రీనివాసరావు, నరసింహారావు, కృష్ణమూర్తి తదితరులు మొదటిరోజు నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలను తగిలి జెసిబి డ్రైవర్ మృతి





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో విషాద ఘటన చోటు చేసుకుంది. పెంట్లం గ్రామానికి చెందిన రెడ్డిపోగు వెంకటేశ్వరరావు(40)దురదృష్టవశాత్తు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయాడు. సీతారామ కాలువ ప్రాజెక్టు పనుల్లో జెసిబి డ్రైవర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వరరావు, సోమవారం మధ్యాహ్న సమయంలో సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామ పరిసరాల్లో జెసిబి యంత్రాన్ని తరలిస్తున్నారు. ఈ క్రమంలో యంత్రం పైభాగం 11 కేవీ విద్యుత్ తీగలను తాకడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. సంఘటన స్థలంలోనే ఆయన మృతి చెందాడు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణ నెలకొంది. సమాచారం అందుకున్న స్థానికులు, సహచర కార్మికులు వెంటనే అక్కడికి చేరుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అక్కడ నుండి సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి ప్రాంగణానికి తరలించారు. మృతుడు వెంకటేశ్వరరావుకు భార్యతో పాటు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు దుఃఖంలో మునిగిపోయారు.

# సైడ్ డ్రైన్ ఆక్రమణల తొలగింపు ఏమైంది సారూ..?

-ఆక్రమణలు తొలగించలేనప్పుడు గీతలు దేనికి..??
-నోటీసులు జారీ చేసి నెలలు గడుస్తున్నా చర్యలు చేపట్టని అధికారులు
-ఆక్రమణల తొలగింపుకి అడ్డుపడేది అధికారులా..? నాయకులా...??





**ప్రజాపక్షం/జూలూరుపాడుః** సైడ్ డ్రైన్ అక్రమణల తొలగింపు ఏమైంది సారూ.? గీతలు పెట్టారు, ప్రచారాలతో హడావోడి చేసారూ. తొలగిస్తారనుకుంటే ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాగా సద్దుమణిగారు చర్యలు ఏమైంది సారూ.? అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. హద్దులు పెట్టి, గీతలు గిసారు, మైక్ ప్రచారం చేశారు. రోజు రోజుకి డ్రైనేజీ ఆక్రమణల తొలగింపు గడువు తేదీ పెరుగుతుందే తప్ప ఆక్రమణల తొలగింపుకు చర్యలు చేపట్టడం పట్టకపోవడంపై మండల ప్రజల నుండి భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి, పంచాయతీ సిబ్బంది ప్రచారానికే పరిమితం అవుతున్నారు తప్ప సైడ్ డ్రైన్ ఆక్రమణలు తొలగింపుకు చర్యలు చేపట్టడం లేదని పంచాయతీ, ఆర్ అండ్ బి అధికారులపై హేళనలు, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**సైడ్డ్రైన్ తొలగింపు లేనప్పుడు గీతలు దేనికి..!**

తల్లాడ, కొత్తగూడెం ప్రధాన రాష్ట్రీయ రహదారి ఆక్రమణల తొలగింపు కోసం యంత్రాంగం గత కొంతకాలంగా చర్యలకు సిద్ధమైంది. గత ఏడాదికాలంగా ప్రధాన రహదారి పక్కన ఉన్న సైడ్ డ్రైన్ ను కొందరు వ్యాపారులు. సైడ్ డ్రైన్ ఆక్రమించడంతోపాటు రోడ్డుపైనే వ్యాపారాలు వెలిశాయి. మరికొందరు ఆక్రమణదారులు ఆక్రమించిన స్థలాల్లో పటిష్ట గదుల నిర్మాణాలు చేసి, అద్దెలకిస్తూ అక్రమ ధనార్జనకు పాల్పడుతున్నారు. దీని కారణంగా రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయంతో పాటు ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. రోడ్డు ఆక్రమణల కారణంగా వాహనాలు ప్రమాదానికి కూడా గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రధాన రహదారితో పాటు పాపకొల్లు క్రాస్ రోడ్, చంద్రుగొండ క్రాస్ రోడ్, జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన కూడళ్ళ వద్ద కూడా ఆక్రమణలు ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారాయి. మండలకేంద్రం ప్రధాన రహదారి పూర్తిగా వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటుంది. దీంతో ప్రజల అసౌకర్యాన్ని, ప్రమాదకర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గత ఏడాదికాలంగా వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ద్వారా ఆక్రమణదారులకు పలుసార్లు నోటీసులు కూడా ఇచ్చారు. నోటీసులు అందిన 48 గంటల్లోగా రోడ్డు ఆక్రమణలను తొలగించాలని, లేనియెడల శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా ఆక్రమణలు ఆగకపోగా ప్రధాన రహదారి ఆక్రమణల పర్వం మరింత కొనసాగడంతో తప్పని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీతో పాటు, (ఆర్ అండ్‌బి) రహదారులు మరియు భవనాలశాఖ ఆక్రమణల తొలగింపుకు శాఖాపరమైన చర్యల కోసం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే గత నెలరోజులు క్రితం మండలం కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆర్ అండ్ బి రోడ్డు సరిహద్దును గుర్తిస్తూ రెడ్ మార్కింగ్ కూడా ఇచ్చారు. అనంతరం వెంగన్నపాలెం గ్రామ పంచాయతీలో మైక్ ప్రచారం కూడా నిర్వహించారు. గత నేల 27వ తేదీలోగా ప్రధాన రహదారి వెంట సైడ్ డ్రైన్ వరకు ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా ఎవరికి వారే తొలగించాలని ఆదేశించారు. లేని యెడల ఆ తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రచారంలో వివరించారు. గడువు గడువు ముగిసిన తొలగింపులు జరగలేదు, మరళా పంచాయతీ సిబ్బంది, మరో వారం రోజులు గడువు పెంచారు. రోజు రోజుకీ గడువు పెంచి ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ప్రచారం విన్న ప్రజలు గడువు పెంచడమే తప్ప ఆక్రమణ తొలగింపుపై చర్యలు చేపట్టడం లేదని మైక్ ప్రచారం విన్న మండల కేంద్రంలోని ప్రజలు ప్రచారానికి పరిమితమ్ముతారు తప్ప తొలగింపులు చేపట్టడంలో విఫలమవుతున్నారని తొలగింపులు చేపట్టకపోవడంపై మండల కేంద్రంలోని ప్రజల నుండి భిన్న స్వరాలు వినబడుతున్నాయి.

**అక్రమణలకు అడ్డు పడేది నాయకులా.? అధికారులా.??**

సైడ్ డ్రైన్ అక్రమణల దారులకు పంచాయతీ సిబ్బంది, ఆర్‌అండ్‌బి సిబ్బంది గత కొంతకాలంగా నోటీసులు ఇచ్చారు. జిల్లా ఉన్నతదికారుల ఆదేశాల మేరకు ప్రధాన రహదారికి ఇరువైపులా హద్దులు పెట్టి మార్కింగ్ చేసారు, స్వచ్ఛందంగా ఆక్రనలు తొలగించాలని 20 రోజులు ప్రచారం చేశారు. పంచాయతీ సిబ్బంది చేసిన హడావుడి కి అక్రమణలు తొలగినట్టే అని వాహన దారులు, పాద చారులు సంతోష పద్ద ప్రజలకు నిరాసే మిగిలింది. మండల పరిధిలోని అధికార పార్టీ నాయకుల రాజకీయ ఒత్తిడో.? లేక ఉన్నత అధికారులు అలసత్వమో.? ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాగా క్రమణల తొలగింపు పై పంచాయతీ అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ, ఆక్రమణల తొలగిపు పై పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న అధికారులకు నాయకుల బెదిరింపా.? లేక ఉన్నతాధికారుల ఆదేశాల..? ఏది ఏమైనా డ్రైనేజీ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణల తొలగింపు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# హైబ్రిడ్ నేరేడు.. నాటు నేరేడు..!

- పోషకాల్లో ఏది మెరుగైంది?





**ప్రజాపక్షం/తల్లాడ:** వర్షాకాలంలో విరివిగా లభించే నేరేడు పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో హైబ్రిడ్ నేరేడు పండ్లు ఎక్కువగా కనిపిస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ నాటు నేరేడు పండ్లు కూడా లభిస్తున్నాయి. ఈ రెండింటి మధ్య పోషక విలువల్లో కొన్ని తేడాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. నాటి నేరేడు పండ్లు సాధారణంగా పరిమాణంలో చిన్నగా ఉండి, ముదురు ఊదా లేదా నలుపు రంగులో ఉంటాయి. వీటిలో సహజంగా యాంటీ ఆక్సిడెంట్లు, పాలీ ఫెనాల్స్, ఆంథోసయానిన్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇవి శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ను తగ్గించి కణాలను రక్షించడంలో సహాయపడతాయి. హైబ్రిడ్ నేరేడు పండ్లు పరిమాణంలో పెద్దవిగా, ఆకర్షణీయంగా ఉండి, గుజ్జు ఎక్కువగా ఉంటూ రుచికి తియ్యగా ఉండటంతో వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. వీటిలో పోషకాలు తక్కువ అని ఖచ్చితంగా చెప్పలేము. పక్వస్థితి వంటి అంశాలపై పోషక విలువలు ఆధారపడి మారుతాయి. నాటు నేరేడు పండ్లలో పీచు పదార్థం(ఫైబర్) ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో జీర్ణక్రియకు మేలు చేస్తుంది. అలాగే రక్తంలో చక్కెరస్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని భావిస్తున్నారు. హైబ్రిడ్ నేరేడు పండ్లలో కూడా విటమిన్‌సీ, ఐరన్, కాల్షియం, పొటాషియం వంటి ఖనాజాలు లభిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్ స్థాయిలు రకాన్ని బట్టి మారొచ్చు.

**- వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం**

నేరేడు ఏ రకమైనదైనా.. ఆరోగ్యకరమైన పండే. మధుమేహం ఉన్నవారు కూడా పరిమిత మోతాదులో వీటిని తీసుకోవచ్చు. పూర్తిగా పండిన, తాజాగా ఉన్న పండ్లు మాత్రమే తీసుకోవాలి.

**- బాగా కడిగి తినడం తప్పనిసరి**

వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్న ప్రకారం హైబ్రిడ్ రకాలు అధిక దిగుబడి, పెద్ద పరిమాణం కోసం అభివృద్ధి చేయబడతాయి. నాటి రకాలు మాత్రం సహజ రుచి, స్థానిక అనుకూలత, జీవ వైవిధ్య పరిరక్షణలో ప్రత్యేకత కలిగి ఉంటాయి.

**- సారాంశం:**

పోషకాల్లో నాటి నేరేడు కొంత ఆధిక్యం ఉండే అవకాశం ఉన్నప్పటికీ, హైబ్రిడ్ నేరేడు కూడా మంచి పోషక విలువలు కలిగిన పండే. ఆరోగ్య ప్రయోజనాల కోసం ఏ రకమైన నేరేడు అయినా సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

- అధికారుల పట్ల నిర్లక్ష్య వైఖరి సరికాదు
- ఎంఎల్‌ఏ కూనంనేని
- అధికారుల నిరసన దీక్షకు సంఘీభావం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారి పోరాటానికి తమ పూర్తి మద్దతుంటుందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. అఖిలభారత బొగ్గగనుల సంఘం (ఐఎంఓసి) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సంగరేణి ప్రధాన కార్యాలయం ముందు అధికారులు సోమవారం నిరసన దీక్షలు మొదలు పెట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శంచిన ఆయన సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమించి సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని చెప్పారు. అధికారుల పే రివిజన్, అలవెన్సులు, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లాభాల్లో వాట, మెరుగైన వైద్య సదుపాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, యాజమాన్యంపై ఉందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అధికారుల సమస్యలపై చొరవచూపాలని లేనికుంటే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు వంగ వెంకట్, జే గట్టయ్య, క్రిష్టాఫర్ పాల్గొన్నారు.

# మహిళా హక్కుల సాధనకై ఉద్యమించాలి

మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి



**ప్రజాపక్షం/మణుగూరుః** మహిళలు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి పిలుపునిచ్చారు. సోమవారం మణుగూరు మండలం సాంబాయి గూడెం గ్రామంలో బోలగని సమ్మక్క కోడిమెల సుజాత, అధ్యక్షు వర్గంగా మహాసభ జరిగింది. ఈ మహా సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్న లక్ష్మీ కుమారి మాట్లాడుతూ జూన్ 4 1954లో కలకత్తా నగరంలో భారత జాతీయ మహిళా సంఘం ఏర్పడిందని, నాటి నుండి నేటి వరకు మహిళలపై జరుగుతున్న దాడులను బాల్య వివాహాల అరికట్టడంలో సతీసహ గమన విధానానికి వ్యతిరేకంగా, అంటరానితనం నిర్మూలనకు, ఇట్టి చాకిరి విముక్తి కొరకు ప్రత్యేక భాషా సంయుక్త రాష్ట్రాల కోసం మహిళలు నడుం బిగించి అనేక పోరాటాలు కొనసాగించి తమ హక్కుల కోసం నినదించారన్నారు. మహిళా లకు చట్ట సభలో రిజర్వేషన్ కల్పించాలని,మహిళా సాధికారత కు ప్రత్యేక కొరకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వం కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. మహిళా లు ఆర్థికంగా రాజకీయం గా ఎదిగినపుడే మహిళలు బలపడతారన్నారు. మతం పేరుతో కొందరు రాజకీయ చేస్తున్నారని వాటిని గమనించుకోవాలని గుర్తు చేస్తున్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళా బిల్లు ను సాకుగా చూపి కేంద్రం రాష్ట్ర ఎన్నికల పునర్విభజన బిల్లు పాస్ చేయించుకోవాలని కుట్ర చేసిందని అందుకే బిల్లును ఆడుకున్నారని, దీనిపై ప్రభుత్వం రాద్ధాంతం చేస్తుందని, ప్రతి పక్షాలపై బూచి చూపించారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న మహిళ ల పై ఏదో ఒక విధంగా దాడులు సాగుతున్నాయన్నారు.వీటిపై ప్రభుత్వం చట్టాలను కఠినంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సమైక్య నాయకురాలు విసం చెట్టి,పద్మజ, మామిడాల ధన లక్ష్మి రత్నకుమారి, ఎస్కే షాహిని, సర్పంచ్ చిడం ఉషారాణి, వార్డు మెంబర్లు జక్కుల స్రవంతి, నిరోష, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, ఉప సర్పంచ్ పులిగల రమేష్ ,గడ్డం వెంకటేశ్వర్లు ఎస్కే సర్వర్, తోట రమేష్, రేగల పద్మ సాధనబోయిన శ్రీలత, ఆగమ్మ, బద్రి కళావతి రేణుక, అనుష తదితరులు పాల్గొన్నారు. ముందుగా మహిళా సమైక్య జెండాను జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి ఎగరవేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు బుల్లోజు అయోధ్య కి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం 19 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

# పారదర్శక ఓటరు జాబితా కోసం అందరి సహకారం అవసరం

-ప్రజాపక్షంతో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ బూర్గంపాడు మండలంలో చురుగ్గా కొనసాగుతోందని తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన ప్రజాపక్షంతో ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేకంగా మాట్లాడారు. మండలంలో 57 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 48,934 ఓటర్లతో ఈ ప్రక్రియ జరుగుతోందని, ఇప్పటి వరకు సుమారు 50శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని వెల్లడించారు. 7 మంది సూపర్వైజర్ల పర్యవేక్షణలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందజేస్తున్నారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపేటప్పుడు 2002 లేదా అంతకు ముందు కుటుంబ వివరాలు, తల్లిదండ్రులు, తాతయ్య, అమ్మమ్మ పేర్లు, జనన సంవత్సరం, పుట్టిన ఊరు వంటి వివరాలు తప్పకుండా సరిగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఓటరు తన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి తప్పులు లేకుండా సమర్పించాలన్నారు. ఇది ఓటరు జాబితా పారదర్శకతకు కీలకమని చెప్పారు. ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని, ప్రజలు కూడా సహకరించాలని తెలిపారు. సందేహాల కోసం మొదట బీఎల్‌ఓలను సంప్రదించాలని, అవసరమైతే తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించవచ్చని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని తెలిపారు. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా బీఎల్‌ఓల ఇంటింటి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రతి ఇంటికి తప్పని సరిగా సందర్శించి అర్హులందరికీ ఫారాలు అందేలా చూడాలని, ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# కేజీబీవీ పాఠశాలను సందర్శించిన రాష్ట్ర సోషల్ ఆడిట్ బృందం

-వసతులు, నిధుల వినియోగం, విద్యా ప్రమాణాలపై సమగ్ర తనిఖీ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో భాగంగా రాష్ట్ర సోషల్ ఆడిట్ బృందం సోమవారం సందర్శించారు. రాష్ట్ర సోషల్ అడిట్ బృంద సభ్యురాలు సత్యలలిత స్థానిక సామాజిక ప్రతినిధులు, కమిటీ సభ్యులతో కలిసి పాఠశాలలో తరగతి గదులు, వసతి గృహాలు, వంట గది, తాగు నీటి సౌకర్యం, పరిశుభ్రత, నిధుల వినియోగం, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడి వారి అభిప్రాయాలు సమస్యలను తెలుసుకున్నారు. కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి ఎప్సిబా మాట్లాడుతూ తనిఖీల్లో సేకరించిన వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ సామాజిక తనిఖీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పారదర్శకత, విద్యా సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంగోతు వెంకటేశ్వరరావు, విశ్రాంతి ప్రాంతీయ గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి షైక్ బురాన్, ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై ప్రభుత్వ కీలక ఉత్తర్వులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు సొంతిల్లు కల్పించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లపై స్లాబ్ సైజుకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్ జారీ చేసిన తాజా జీఓ ప్రకారం ఇకపై ఇళ్ల స్లాబ్ విస్తీర్ణం 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్య మాత్రమే ఉండాలని హైసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్ తెలిపారు. స్లాబ్ ముందు భాగంలో మూడు అడుగులు, మిగతా వైపులా ఒక్క అడుగు మాత్రమే పొడిగింపు అనుమతి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పేదలపై అదనపు ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు హౌసింగ కార్పొరేషన్ తెలిపిందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ 5లక్షల ఆర్థిక సహాయానికి మంచి ఖర్చు పెరగకుండా నియంత్రించడమే లక్ష్యమని వివరించారు. ఇళ్ల నిర్మాణంలో నీడ అవసరమైతే స్లాబ్ విస్తరణకు బదులుగా తలుపులు, కిటికీలకు సన్నెడ్లు(చజ్జాలు)ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఆర్‌సీసీ స్లాబ్ స్థానంలో జీఐ షీట్ ఆధారిత షెడ్లు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ నిబంధనలు ఇప్పటికే నిర్మాణ దశలో ఉన్న పునాది, బేస్మెంట్, గోడల ఇళ్లకు వర్తించవని, ఇంకా నిర్మాణం ప్రారంభించని లబ్దిదారులకు మాత్రమే వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు.

## ఎఫ్‌పీఓతో రైతులకు ఆధునిక వ్యవసాయం



**ప్రజాపక్షం/కారేపల్లి:** రైతులు ఎఫ్‌పీఓలో సభ్యులై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కారేపల్లి సహకార సంఘం ఛైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఎఫ్‌పీఓ డొమైన్ ఎక్స్‌పర్ట్ చావా అరుంధతి పిలుపునిచ్చారు. సహకార వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ రూ 2వేల సభ్యత్వంతో కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకం, డ్రోన్ పిచికారీ సేవలు, హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతులు ఎఫ్‌పీఓలో చేరి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి బొల్లు హనుమంతరావు, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, దేగల ఉపేందర్, సర్పంచ్ గుమ్మడి సందీప్, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డైరీల పంపిణీ



**ప్రజాపక్షం/కూసుమంచి:** జేడ్‌పిహెచ్‌ఎస్ చేగొమ్మలో 6 తరగతి వరకు చదువుతున్న 120 మంది విద్యార్థినీ విద్యార్థులకు రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ బయో సైన్స్ ఉపాధ్యాయులు పివి రమణ స్వయంగా రూ 6వేలు వెచ్చించి పాఠశాల డైరీలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ డైరీలు విద్యార్థులకు హోంవర్క్ నిర్వహణలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు ఇంటి వద్దే పాఠశాలలో ఇచ్చిన పనులను సులభంగా చూసుకుని పూర్తి చేయగలరని, అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఇచ్చే హోంవర్క్ వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. డైరీలు అందజేసిన పివి రమణను ప్రధానోపాధ్యాయులు టీ రాధాకృష్ణతో పాటు ఉపాధ్యాయులు టి చంద్రశేఖరరావు, సిహెచ్ రవి కిరణ్, బి అమ్ము, బి యాదగిరి, వి శ్రీనివాసరావు, షహనాజ్ బేగం, పి రాజు, నాన్ టీచింగ్ సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందించారు.

## ఫీజులు పెంపుపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/కరకగూడెంః** అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరకగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజులు నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కరకగూడెం ఎంఈఓ కి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మాదాసు అఖిల్ మాట్లాడుతూ కరకగూడెం మండలంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా పెరిగాయని, అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో భవనాలు పెచ్చులుడుతున్నాయని, మరుగుదొడ్లు సరిగ్గా లేక, సరిపడ టీచర్లు లేక త్రాగడానికి మంచినీరు కూడా లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్నో గొప్ప లక్ష్యాలతో చదువుకోడానికి వచ్చిన నూతన విద్యార్థులకు పాత సమస్యలే దర్శనం ఇచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేలకొండపల్లి ఎస్సైగా శ్రీనివాసరెడ్డి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి:**నేలకొండపల్లి ఎస్సైగా శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్సైగా విధులు నిర్వహించిన సంతోశ్ ఖమ్మంకు బదిలీ కాగా ఆయన స్థానంలో బోదు ఎస్సైగా విధులు నిర్వహించిన శ్రీనివాసరెడ్డి బదిలీపై పదవీ బాధ్యతులు స్వీకరించారు. ఈమేరకు శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.

# నూతన విద్యా విధానం రద్దుకై ఉద్యమించాలి




**-ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు దండి సురేష్**
**-విద్యా రంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలి**
**-ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సురేష్ మాట్లాడుతూ నేడు దేశంలో నూతన విద్యా విధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూనివర్సిటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేయనుందన్నారు. ఈ విధానాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని ఆయన ఆరోపించారు. కేంద్రీయ విశ్వ విద్యాలయాలతో ఆరెసెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న వారినే యూనివర్సిటీలలో నియమాకాలు చేస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా జిడిపిలో ఆరు శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యా విధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపర్చకుండా నూతన జాతీయ విద్యా విధానంలో పేదవారికి ఉచిత విద్య లేనట్టేనని ఆయన పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు, జిల్లా నిర్మాణ బాధ్యులు రావి శివరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. తక్షణమే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ గురుకులాల్లో సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ గురుకులాల్లో కనీస వసతి సౌకర్యాలు కల్పించకపోతే ఆందోళన నిర్వహిస్తామన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలకు సంసిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా 27వ మహాసభలు ఆగస్టు 20, 21 తేదీల్లో సత్తుపల్లి పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, మనోజ్, సాయి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రెబ్బవరంలో దొడ్డా వరప్రసాద్ ఉద్యోగ విరమణ

**ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు**



**ప్రజాపక్షం/వైరా:** తల్లి తండ్రి గురువు దైవం పూజ్యులుగా సమాజ హితం బాధ్యతగా తోటి వారందరూ హితులుగా స్నేహితులుగా సన్నిహితులుగా మండల స్థాయి నుండి, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నవభారత నిర్మాణానికి పునాది వేసే సంఘ బాధ్యులుగా, సోషల్ ఉపాధ్యాయుడిగా అందరికి ఆదర్శప్రాయుడిగా అందరి వాడిగా పేరొందిన దొడ్డా వరప్రసాద్ స్కూల్ అసిస్టెంట్(సోషల్) రెబ్బవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవీవిరమణ చేయనున్నారు. ఇంటర్మీడియట్ అనంతరం పట్టుదలతో దూరవిద్య ద్వారా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల్లో ఎంఏ, కాకతీయ విశ్వవిద్యాలయం నుండి తెలుగు విభాగంలో ఎంఏ,భారతీదాసన్ విశ్వవిద్యాలయం నుండి ప్రతిష్టాత్మకమైన ఎం.ఇడి పట్టాలను సాధించి నిరంతర జ్ఞానాన్వేషిగా పిలిచిన జ్ఞానపిపాసి పదవీ విరమణానంతరం కూడా ధర్మశాస్త్రమును(లా కోర్సు) అభ్యసించవలెననే పట్టుదల కలిగిన వ్యక్తి దొడ్డా వరప్రసద్ ఉపాధ్యాయ వృత్తికి పూర్వమే దశాబ్ద కాలం పత్రిక రంగంలో పేపర్ ఏజెంట్‌గాను, పది సంవత్సరాలు విలేకరి గాను పని చేశారు. అడ్వర్టయిజింగ్ ఏజెన్సీ అధినేతగా రాణించి ఈనాడు అధినేత రామోజిరావు హస్తకమలముల మీదుగా అత్యున్నత పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలలో 3 సంవత్సరాలకు పైగా అడహాక్ బేస్‌లో పనిచేశారు. 12.12.1996న కుర్నవల్లి పాఠశాలలో ప్రథమ నియామకం పొంది, గురువుతో కలిసి పనిచేసిన అదృష్టానికి నోచుకున్నారు. పెద్ద రామాపురం, గుట్టబడి, తాటిపూడి, వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధి నిర్వహణగావించి జూన్ 2024న సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. ప్రతి సంవత్సరం సొంతంగా రూ.25వేలు విద్యార్థుల విద్యావసరాలకు అందించారు. 2020వ సంవత్సరములో మంత్రివర్యులు పువ్వాడ అజయ్‌కుమార్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

# పొంగులేటిపై విమర్శలు మానుకో..

**కాంగ్రెస్ నేతలు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నేతలు సూచించారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులోని సాయి గణేష్‌నగర్‌లో గల చైర్‌పర్సన్ క్యాంప్‌కార్యాలయంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు స్వర్ణకుమారి మాట్లాడుతూ.. పార్టీల ఫిరాయింపులకు పాల్పడి కాంగ్రెస్ పార్టీలో గెలుపొందని కందాళ ఉపేందర్‌రెడ్డి, సత్తుపల్లి, అశ్వరావుపేటతో పాటు పలువురు ఎమ్మెల్యేలను కొన్నారని అన్నారు. రైతులు ఏం చేశామని కాదు ఏం చేస్తున్నాం ఏం చేయబోతున్నామని ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకానీ మీకులా చేయని పనులు చేసినట్టుగా ఊదరగొట్టుకోవడానికి, మీ హంగు ఆర్భాటం చూపించడానికి పెట్టేలాంటి సభ కాదన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్, ఖమ్మంరూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, సర్పంచ్ పాపనాయక్, కౌన్సిలర్లు దివ్య, నవీన్, రవి, ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు వెంపటి రవి, ముత్యం చిన్న కృష్ణారావు, రంజిత్‌నాయక్, గునిగంటి సురేష్, రమేష్, బోయిన సాయి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద, సామ్రాజ్యవాద విధానాలపై ప్రజాపోరాటం అవసరం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** భాజపా, ఆర్ఎస్ఎస్ సనాతన ధర్మం పేరుతో సాగిస్తున్న మతోన్మాద, సామ్రాజ్యవాద విధానాలపై ప్రజాపోరాటం అవసరమని, ప్రముఖ అధ్యాపకుడు బోడపట్ల రవీందర్ పిలుపునిచ్చారు. మండలంలో సోమవారం జరిగిన సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ రాజకీయ శిక్షణ తరగతుల్లో 'మతోన్మాద రాజకీయాలు ప్రతిఘటన' అనే అంశంపై మాట్లాడారు. బీజేపీ 'ఒకే దేశం, ఒకే మతం' అంటూ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. అనంతరం అధ్యాపకుడు బండారు రమేశ్ 'సామ్రాజ్యవాదంద్రవ్య పెట్టుబడి' అంశంపై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా గుత్త పెట్టుబారీ సంస్థలు సంపదను కొల్లగొడుతున్నారన్నారు. అమెరికా ఆధిపత్యం కోసం యుద్ధాలు రగిలిస్తూ ఖనిజ సంపదను దోచుకుంటోందని, మోధీ ప్రభుత్వం సహకరించడం శోచనీయమని, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు నంద్ర ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, ఊరడి సుదర్శన్ రెడ్డి, మల్లెల సన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.




# ముఖ్యమంత్రిని కలిసిన ఉపసర్పంచ్ బండి బాలశౌరి



**ప్రజాపక్షం/తల్లాడ:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని సీఎం కార్యాలయంలో సోమవారం మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామ ఉపసర్పంచి, కాంగ్రెస్ నాయకుడు బండి బాలశౌరి కలిశారు. ఈ మేరకు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, గ్రామ సమస్యలపై వినతిపత్రం అందించారు.

# రైతు సంక్షేమమే పాలకవర్గ లక్ష్యం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రైతు సంక్షేమమే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ లక్ష్యమని నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ తీగ రమణయ్య పేర్కొన్నారు. మండలంలో సోమవారం వివిధ సొసైటీలలో సహకార వారోత్సవాలు ప్రారంభించిన క్రమంలో సొసైటీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సొసైటీ ద్వారా రైతులు రుణాలను తీసుకుని ఆర్థికస్వావలంభన సాధించాలని సూచించారు. రైతులు రుణాలు తీసోవడంతోపాటు రుణాలను తిరిగి చెల్లించి సొసైటీల బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కనకబండి కనకరాజు, సీఈఓ ఖమ్మం వెంకటేశ్వర్లు, కనపర్తి నాగేందర్, డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సహకార వారోత్సవాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని నడితండలో గల సొసైటీ కార్యాలయంలో సహకార వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సహకార జెండాను చైర్మన్ జర్పుల లక్ష్మన్‌నాయక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్‌లు మద్ది కళింగరెడ్డి, రెంటాల నీరజ, మట్టా శ్రీకాంత్, సంఘం సెక్రటరీ చంద్రయ్య, రైతులు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాకు దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** మండల పరిధిలో కొత్తగా పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులు యాసంగి రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి సాయిశివ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి పట్టాదారు పాసు పుస్తకం నకలు లేదా డిజిటల్ సంతకంతో నకలు, ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా నకళ్లు, దరఖాస్తు ఫారం ధ్రువీకరణ పత్రాల నకళ్లను సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించాలి. జూన్15, 2026నాటికి భూభారతి(ధరణి)పోర్టల్‌లో ఉన్న పట్టాదారుల డేటా రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు సాయం అందించేందుకు భూపరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) నుంచి పొందబడిందని, డిజిటల్ సంతకమైన రైతులు అర్హులని, గతంలో రైతుభరోసా పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేయాల్సినవసరం లేదని తెలిపారు. ఈమేరకు దరఖాస్తులు జూలై5వతేదీ చివరి తేదీ అని తెలిపారు.

# విద్యార్థులకు రిక్రియేషన్ క్లబ్ ప్రోత్సాహం



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** రిక్రియేషన్ క్లబ్ నూతన అధ్యక్షుడు చావా రామకృష్ణ, కార్యదర్శి గడ్డం శ్రీనివాసరావు అధ్యక్షతన మధిర, ఎర్రుపాలెం మండలాల ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో చదివి మండల ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు, ట్రిపుల్‌ఐటీ బాసరలో సీట్లు సాధించిన వారికి సోమవారం నగదు పురస్కారాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం, ఆర్థిక చేయూత అందించడంలో క్లబ్ ముందుందని తెలిపారు. మధిర మండల ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన మర్లపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు నరేడ్ల లక్ష్మీ తిరుష, వడ్డెవరపు ఉమాదేవిలతో పాటు ఐఐఐటీ బాసరలో సీటు సాధించిన పోలారెడ్డి జీవిత రెడ్డిలకు రూ.10వేలు. రూ.5వేలు, రూ.3వేలు నగదుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భీమరాజు, ఉపాధ్యాయుడు కోటారెడ్డి, తల్లిదండ్రులు నరెడ్ల స్వాతి, రామకృష్ణారెడ్డి, వడ్డెవరపు యశోద తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ మ్యూజియంను సందర్శించిన డిఈవో



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా సైన్స్ మ్యూజియంను ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి సదానందం సందర్శించారు. సోమవారం సైన్స్ మ్యూజియంను డిఈవో సదానందం సందర్శించి మ్యూజియం పరిసరాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మ్యూజియంకు అవసరమైన ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. ఇన్‌స్ట్రక్టర్లు మ్యూజియం సందర్శించే విద్యార్థులకు సైన్స్ నమూనాలు వివరిస్తారని డిఈవో తెలిపారు. అనంతరం డిఈవో మాట్లాడుతూ సైన్స్ మ్యూజియం సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తెరిచి ఉంచాలని తెలిపారు. భోజన విరామ సమయం మధ్యాహ్నం 1 గంట నుంచి రెండు గంటల వరకు మాత్రమేనన్నారు. ఆదివారం, రెండవ శనివారం, ఇతర ప్రభుత్వ సెలవుల్లో సైన్స్ మ్యూజియంకు కూడా సెలవు ఉంటుందని తెలిపారు. మ్యూజియంకు వచ్చే విద్యార్థులకు ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి వివరాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వత్స శ్రీనివాస్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్, నూతన ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో పొరపాట్లకు తావివ్వొద్దు

## -జిల్లా కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రత్యే ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ములకలపల్లి మండలంలో పర్యటించిన ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఇంటిని తప్పని సరిగా సందర్శించి అర్హులందరికీ ఫారాలు అందేలా చూడాలని సూచించారు. ఓటర్ల సందేహాలు నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని, అర్హులైన ఎవ్వరూ మిస్ కాకూడదని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలనను పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ములకలపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ సేవలు, మందుల నిల్వలు, ల్యాబ్, ఫార్మసీ, పరిశుభ్రతను పరిశీలించారు. అవసరమైన మందులు, పరీక్షా కిట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ స్వాతి బిందు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాన్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, మెడికల్ సిబ్బంది ఇమ్రాన్, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల వందశాతం హాజరే లక్ష్యం

## -కేజీబీవీ ఆకస్మిక తనిఖీలో జిల్లా విద్యాధికారి వాసంతి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వంద శాతానికి చేరేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి సూచించారు. సోమవారం బూర్గంపాడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫేస్ రికగ్నిషన్(ఎస్ఆర్ఎస్)యాప్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించిన ఆమె, నలుగురు ఉపాధ్యాయులు గైర్హాజరైనట్లు గుర్తించి, మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కొత్త అడ్మిషన్లు పెంచడంతో పాటు ఎన్‌రోల్‌మెంట్ మెరుగుపరచాలని సూచించారు. వంట గది, ఆహార నిల్వలు, మరుగుదొడ్లు, పాఠశాల పరిశుభ్రతను పరిశీలించిన ఆమె, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిశుభ్ర వాతావరణాన్ని కొనసాగించాలని ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించిన డీఈఓ వాసంతి, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి డిజిటల్ విద్యా వేదికలను వినియోగించుకుని విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. వారం రోజుల్లో మరోసారి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటికి విద్యార్థులందరూ క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# నేడు మణుగూరు పట్టణ బంద్‌కు సహకరించండి

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఓసి 2 డిప్ సైడు బ్లాక్ ను సింగరేణికి అప్ప చెప్పాలని, మణుగూరు ఓసి ఎక్స్టెన్షన్ పర్మిషన్ తీసుకురావాలని. సేవ్ మణుగూరు పేరుతో నేడు మణుగూరు పట్టణ బంద్ నిర్వహిస్తున్నట్లు అఖిల పక్ష పార్టీల నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి,మున్నా లక్ష్మీ కుమారి, (సిపిఐ), సత్రపల్లి సాంబశివరావు (సీపీఎం), ఆర్ మధుసూదన్ రెడ్డి సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) మద్దెల భద్రయ్య (తెలుగుదేశం) తెలిపారు. ఈ బందుకు మణుగూరు పట్టణ ప్రజలు, చాంబర్ ఆఫ్ కామర్స్, వ్యాపార వర్గాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పట్టణ పూర్వ ప్రముఖులు అన్ని రాజకీయ పార్టీలు కార్మిక సంఘాల నాయకులు సహకరించి బంద్ లో పాల్గొనాలని అన్ని వర్గాల విజ్ఞప్తి చేశారు. 1974 సంవత్సరంలో మణుగూరులో ప్రారంభమైన బొగ్గు గనులు అటు నుంచి నేటి వరకు అనేక దశల్లో విస్తరించి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేశారని సింగరేణి మూలంగా ఈ ప్రాంతంలో వ్యాపార సంస్థలు వారిధ్య సంస్థలు అభివృద్ధికి దూరం జరిగిందన్నారు. కానీ నేడు మణుగూరు పీకే ఓసీ 2 డిప్ సైడు బ్లాక్ ప్రైవేట్ పరం చేయాలని ప్రయత్నం చేస్తారని కావున ఈ బ్లాక్ ను సింగరేణి సంస్థ కు అప్పగించాలని, మణుగూరు ఓసి ఎక్స్టెన్షన్ పర్మిషన్ తీసుకురావాలని లేని పక్షంలో మణుగూరులో బొగ్గు కొరత ఏర్పడి మణుగూరు మనగడా కోల్పోయే ప్రమాదం ఉందని, కావున సింగరేణి కాపాడుకోవాలంటే మణుగూరు సేవ్ పేరు తో జరిగే ఈ బంద్ కార్యక్రమాన్ని మణుగూరు పట్టణంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, వ్యాపార సంస్థలు, చాంబర్ ఆఫ్ కామర్స్, స్వచ్ఛంద సంస్థలు, పట్టణ పుర ప్రముఖులు అన్ని వర్గాల ప్రజలకు సహకరించి బంద్ లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు ఎడారి రమేష్, సొందే కుటుంబరావు, ఎస్‌కె. సర్వర్, ఎం.వి.రాం నరసయ్య మేకల ఈశ్వర్ (సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ,అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి) కొత్తపల్లి సీతారాములు, బొల్లం రాజు (సిపిఎం), హరి (టిడిపి),వి. జానాయ (సిపిఐ ఎంఎల్ మాస్ లైన్) లు పాల్గొన్నారు.



# పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పోరేట్ వైద్య సేవలు

## - విరిగిన పైదవడకు ఆధునిక శస్త్ర చికిత్స



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పోరేట్ ఆసుపత్రులకు తీసిపోని వైద్య సేవలను అందిస్తున్నారు. దాడిలో పై దవడ విరిగిన ఓ వ్యక్తికి ఆధునిక శస్త్ర చికిత్స చేశారు. వివరాల్లోకి వెళితే పాల్వంచ దాబానగర్‌లో రెండు కుటుంబాల మధ్యన జరిగిన గొడవలో బానోత్ కరణ్‌సింగ్‌కు ఎడమ ముఖ భాగానికి తీవ్రంగా గాయలయ్యాయి. క్షతగాత్రుడిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆయనకు పై దవడ చెంప ఎముకలు విరిగినట్లు గుర్తించారు. అనంతరం రోగి పరిస్థితిని పరిశీలించిన వైద్యులు వంశీ వెంటనే శస్త్ర చికిత్స చేయటానికి నిర్ణయించారు. సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించిన వైద్యులు క్షతగాత్రుడికి టైటనియమ్ ప్లాటింగ్ ద్వారా విరిగిన ఎముకలను యథాస్థానంలో అమర్చారు. దీనితో పాటుగా ఇంటర్ మాక్సిలరీ ఫిక్సేషన్ (ఐఎంఎఫ్) చేసి దవడలను యథాతదంగా అమర్చారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రవేటు ఆసుపత్రులలో ఇలాంటి ఆపరేషన్‌కు సుమారు ఎనభై వేయిలు ఖర్చు అవుతుందని వైద్యులు ఎలిపారు.ఈ ఆపరేషన్‌లో ఓరోమాక్సిలరీ ఫేషియల్ సర్జన్ మోహన క్రిష్ణ వంశీ, మత్తు వైద్యులు శంకర్‌రావు, నర్సులు పి. రేవతి, ఎస్. జ్యోతి, శిరీషలు పాల్గొన్నారు. విజయవంతంగా ఆపరేషన్ చేసిన వంశీ క్రిష్ణ బృందాన్ని జిల్లా ఆసుపరతుల సమన్వయ కర్త (డిసిహెచ్ఎస్) జి. రవిబాబు, ఆసుపత్రి సూపరిండెంట్ రాం ప్రసాద్, ఆర్ఎంఓ సోమరాజు దొరలు అభినందించారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత నాణ్యమైన వైద్య సేవలను అందిచటం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో మరింత నాణ్యమైన సేవలను అందించాలని ఆకాంక్షించారు.



# ఇంటింటికి ఫారాల పంపిణీ

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా 97వ బూత్ పరిధిలోని పిరాయిగూడెంలో ఇంటింటికి వెళ్లి ఓటరు సవరణ ఫారాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బిఎల్ఓ నరసింహారావుతో కలిసి బిఆర్ఎస్ పార్టీ 97వ బూత్ బిఎల్‌ఏ పోడియం రమేష్ ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందజేశారు. ఈసందర్భంగా జోగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. బిఎల్ఓ అందజేసిన ఫారాలను జాగ్రత్తగా నింపి, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో అతికించి బాధ్యతగా తిరిగి బిఎల్ఓకు సమర్పించాలని తెలిపారు. బిఎల్ఓ గ్రామాల్లో సందర్శన సమయంలో ఓటర్లు అందుబాటులో లేకపోతే మరో రెండు సార్లు మాత్రమే ఇంటికి వస్తారని, ఆ తర్వాత తిరిగి రారని తెలిపారు. కాబట్టి ప్రతి ఓటరు ఫారం తీసుకుని తప్పని సరిగా పూర్తి చేసి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వాగే రాజు, వాగే వెంకటేష్ పాల్గొన్నారు.



# పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** అంజుబాకా గ్రామ పంచాయితీ అభివృద్ధి కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు అంజుబాకా సర్పంచ్ కొమరం శాంతమ్మ తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల ప్రాంతామైన అంజుబాకా పంచాయితీ పరిధిలోని జి వీరభద్రపురం, అంజుబాకా గిరిజన రెవెన్యూ గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులు 100శాతం పూర్తయినప్పటికీ, 40 శాతం మెటీరియల్ పేమెంట్ నిధులు విడుదల కాకపోవడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో పర్యటించి సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొమరం చంటి, గ్రామస్తులు నరసింహారావు, చిట్టిబాబు, వీరేష సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



# పల్లెటూరి అభివృద్ధికి సహకార సంఘాలే పట్టుకొమ్మలు

**ప్రజాపక్షం/ఏన్కూరు:** సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలని, రైతులు వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని గార్ల ఒడ్డు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా సోమవారం సంఘ కార్యాలయంలో ఆయన సహకార జెండాను ఆవిష్కరించి, సభ్యులతో కలిసి సహకార ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ సంఘం నిర్వహించే వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు బోనస్‌ను కూడా రైతులు పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రేగళ్ల తిరుమలరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్, సొసైటీ సీఈవో మీరా, మేడా ధర్మారావు, మాలోత్ బామన్, అమరనేని కోటేశ్వరమ్మ, రాయాల నరసింహారావు, కొనకంచి వెంకటేశ్వర్లు, ఉమ్మినేని శేఖర్, ఆది నరసింహారావు, ఆది వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తహశీల్దార్ నాగరాజు అన్నారు. చుంచుపల్లి మండల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనుల ప్రణాళిక, నిధుల సద్వినియోగం, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, పచ్చదనం, ప్రజాభాగస్వామ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎస్ఐఆర్ పై అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతోపాటు అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సారా స్థావరాలపై మెరుపుదాడులు

**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల పరిధిలోని కలవల నాగారం సమీపంలోని అటవీ ప్రాంతంలో పలు సారా స్థావరాలపై మెరుపు దాడి చేసినట్లు కరకగూడెం ఎస్సై పివిఎన్.రావు తెలిపారు. ఈ దాడిలో సుమారుగా 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే సారాను తయారు చేయటానికి ఉపయోగించి బిందెలును మరియు గిన్నెలు లను కూడ స్వాధీన పరుచుకున్నారు. మండలం లో ఎవరైనా సారా తయారు చేసినట్లు తమ దృష్టికి వస్తే కరకగూడెం పోలీస్ వారికి వెంటనే సమాచారం అందించినట్లయితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంప్రదించవల్సిన ఫోన్ నెంబర్లు 8712682103 కరకగూడెం పోలీస్‌స్టేషన్ 8712682102 నెంబర్లను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.



# ప్రణాళిక ప్రకారం నియోజకవర్గ అభివృద్ధికి బాటలు

**- రూ. 1. 65 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంఎల్‌ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/పాల్వంచ :** అభివృద్ధి పనులతోనే గ్రామాలలో ప్రగతి సాధ్యమని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు.మండల పరిధి లక్ష్మీదేవిపల్లి (ఎస్), బసవతారక కాలని, బిక్కుతండా, కేశవాపురం, నాగారం కాలని, రంగాపురం, నారాయణరావు పేట, సంగం, దంతెలబోర తదితర గ్రామాలలో రూ. 1. 65 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్‌ల పనులకు సోమవారం శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సంధర్భంగా ఎంఎల్‌ఏ కూనంనేని మాట్లాడుతూ పల్లె రహదారులు, ప్రధాన రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి దశల వారీగా నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. రహదారుల సౌకర్యాల మెరుగు పడితే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని, ప్రతీ గ్రామ పంచాయితీ కేంద్రాలలో హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పంచాయితీ కార్యాలయాలు, కమ్యూనిటి హాల్స్, ప్రభుత్వ సేవా కేంద్రాలకు సొంత భవనాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా వారి సంక్షేమం, నియోజక వర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నానని నిధులు రాబట్టేందుకు ఏ చిన్న అవకాశం వచ్చినా పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం జరుగుతోందన్నారు. శంఖుస్థాపను జరిగిన పనులు నాణ్యతా ప్రమాణాలతో



పది కాలాల పాటు మన్నికగా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. అందుకు అధికారులు బాద్యతాయుతంగా పని చేయాలని, జరుగుతున్న పనులను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలు సైతం పనులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులయ ముత్యాల విశ్వనాథం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణ చందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, తహశీల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ , ఎంపిఓ, ఎంఈఓ, సర్పంచులు, ఉప సర్పంచులు, పలు శాఖ అధికారులు, సిపిఐ నాయకులు నిమ్మల రాంబాబు, మన్నెం వెంకన్న, జకరయ్య, వైఎస్ గిరి, గొర్లె నరేష్, ఆలపాటి ప్రసాద్, కాకటి రవీందర్, భూక్యా విజయ్, రమేష్, మద్దెల వీర మోహనరావు, ఆవుల సతీష్, తెజావత్ వినోద్, మాలోత్ హరి, బానోత్ రంజిత్, తెజావత్ ప్రేమ్ కుమార్, చంచలపురి శ్రీను, బానోత్ రవి, వెల్లంకి శివరామ్, లాల్‌పాషా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో తక్షణమే అమలు చేయాలి

**ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి**



**ప్రజాపక్షం/ఖమ్మం:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టో హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకరకు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మహిళలకు పలు హామీలు ఇచ్చిదని కేవలం ఉచిత బస్సు మినహా మిగిలిన ఏ హామీని నేరవేర్చలేదని నీరజ, లతాదేవి లు తెలిపారు. ఆత్మీయ భరోసా పథకం కింద రూ. 12 వేలు ఆర్థిక సాయం, తులం బంగారం, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.2,500, రూ. 500కే గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, విద్యార్థులకు స్కూటీలు పంపిణీ పథకంతో పాటు మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని సంక్షేమ హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. అదే విధంగా రాష్టంలో మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా నాయకులు పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి , మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపివో నియామకం ఎప్పడో..?

**-పది రోజులుగా ఖాళీ కుర్చీ**
**-తల్లాడలో అదే పరిస్థితి**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల పరిషత్ కార్యాలయం నందు గత పది రోజులుగా ఎంపివో లేక ఖాళీగా దర్శనమిస్తుంది. గ్రామపంచాయతీ కార్యకలాపాల్లో అత్యంత కీలకమైన శాఖ ఎంపివో వైరా ఎంపివోగా నిధులు నిర్వహించిన రాజేశ్వరి ఎంపిడివోగా పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి వెళ్లారు. అప్పటి నుండి నేటి వరకు ఎంపివో లేక ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంపివోను నియమిస్తారా? నియమించరా అనేది కూడా ఇప్పుడు అర్థంకాని పరిస్థితి. ఎవరికైనా ప్రమోషన్ లభిస్తేనే మరల ఎంపివోగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది అనే ప్రచారం జరుగుతుంది. గ్రేడ్ వన్ సెక్రటరీలకు బాధ్యతలు ఇస్తారా, ఎంపివో బాధ్యతలు కూడా ఎంపిడివోలు నిర్వహించే విధంగా ఆదేశబూలు ఇస్తారా అనేది ప్రచారం జరుగుతుంది. ప్రతి మండలంలో గ్రామపంచాయతీలపై ఎంపివో ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. అలాంటి కీలకమైన ఎంపివో లేకపోవడం వలన కీలకమైన ప్రభుత్వ శాఖల్లోని పనులు కూడా అధికారులకు ఇబ్బందికరంగా మారాయి. మండల సూపరిండెంట్లకు ఎంపివో బాధ్యతలు అప్పజెబుతారనేది ప్రచారం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికీ మండల పరిషత్‌లో కీలకమైన ఎంపివో నియామకం జరుగుతుందా లేదా ఇంచార్జిలకు అప్పగిస్తారా అనేది ప్రచారం జరుగుతుంది.

# ప్రజావాణి వినతులు పరిష్కరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలో అందిన ప్రతీ వినతిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ఆయన జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి పలు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం అంకిత్ మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో ప్రజలు ఇక్కడిదాకా వచ్చి సమస్యలను విన్నపించుకుంటుంటారని, ఆయా సమస్యల పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు దశలవారీగా దరిచేరుతాయని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. పరిష్కారానికి నోచుకోని దరఖాస్తులపై అధికారులు సమగ్ర నివేదికలు త్వరితగతిన ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మీ ప్రభుత్వాన్ని కూల్చేది వారే..

**-లక్ష కోట్ల దోపిడీకి ప్రభుత్వ యత్నం : బిఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే కృష్ణార్జునులే కేటిఆర్, హరీష్‌రావు లని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి తెలిపారు. కాళేశ్వరం కూలేశ్వరం అయితే మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్‌కు నీళ్లను ఎక్కడి నుంచి తెచ్చి పోస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సోమవారం స్థానిక బిఆర్ఎస్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కేటిఆర్ పాదయాత్ర, కేసిఆర్ బస్సు యాత్ర చేపడితే మోసాల కాంగ్రెస్ కథ కష్టమేనన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి 30 నెలల్లో పాఠశాలల అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా ఖర్చు పెట్టారా అని ఆయన ప్రశ్నించారు. కేవలం కక్షసాధింపులకు, బూతు పురాణాలకే ఈ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రైఫిల్ ఎక్కుపెట్టిన విలన్ పాత్ర రేవంత్‌రెడ్డిదని తెలంగాణను సాధించిన ఘనత కేసిఆర్‌ది అన్నారు. రూ.9వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఉండడంతో ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందని సర్టిఫికెట్లు రాక విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల సమస్యలపై బిఆర్ఎస్ పక్షాన ఖమ్మంలో రౌండ్ టేండ్ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాకేష్‌రెడ్డి తెలిపారు. మీడియా సమావేశంలో అడ్వకేట్ జేఏసి నాయకులు బిచ్చాల తిరుమలరావు, బలుసు మురళీకృష్ణ పాల్గొన్నారు.

# గిరిజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, జగన్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ గిరిజన సమాఖ్య ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ రాంబాబు, బానోత్ జగన్ లు ఎన్నికయ్యారు. గిరిజన సమాఖ్య ఖమ్మం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వీరి ఎన్నిక జరిగింది. ఏన్కూరు మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన రాంబాబు గిరిజన సమాఖ్యలో భారత కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన వివిధ ప్రజా సంఘాల్లో పనిచేశారు. ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాకు చెందిన జగన్ గత దశాబ్ద కాలంగా గిరిజన సమాఖ్యలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారం కోసం గిరిజన సమాఖ్య నేతృత్వంలో కృషి చేయనున్నట్లు తెలిపారు. రఘునాథపాలెం మండలానికి చెందిన బానోత్ నాగేశ్వరరావును జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నారు.

# నూతన పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎస్‌పి



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ నవభారత్ సమీపంలో నిర్మాణంలో గల నూతన పోలీస్ కార్యాలయ భవన నిర్మాణ పనులను జిల్లా ఎస్‌పి బిరుదురాజు రోహిత్‌రాజు సోమవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎస్‌పి సంభంధిత అధికారులు, ఇంజనీర్లతో మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. భవనంలో ఏర్పాటు చేయనున్న కార్యాలయ గదులు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, బి. శ్రీనివాస్, రోడ్లు, భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సుదీర్ఘకాలం పాటు సేవలందించిన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పదవీ విరమణ పొందుతున్న సిపిఐ సంజీవరావు, డివిఏహెచ్‌ఓ వెంకటేశ్వర్లు హౌసింగ్ ఇంజనీర్ రమేష్ బాబు, ఆఫీస్ సబార్డినేటర్ ఆంజనేయులు పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ప్రతీ ఉద్యోగి విషయంలో జరుగుతుందని, ఉద్యోగంలో చేరిన నాటి నుండి దిగిపోయే వరకు సమాజంలో గుర్తింపు ఉంటుందని, విధి నిర్వహణలో సంపాదించిన అనుభవం, ప్రజల ఆదరణ జీవితాంతం వెంట ఉంటాయన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులు వారి విలువైన అనుభవాలను ప్రస్తుత ఉద్యోగులకు పంచాలని చెప్పారు. శేషజీవితం హాయిగా సంతోషంగా ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలల సంరక్షణకు అధికారులు కృషి చేయాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బాలల సంరక్షణ పట్ల అధికారులతో పాటు ప్రజలు కూడా తమ వంతు కృషి చేయాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. సోమవారం సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఆపరేషన్ ముష్కాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా దేశంలో ఆపరేషన్ ముష్కాన్ పిల్లల సంరక్షణ పట్ల ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎవరైనా 18 సం.నిండిన పిల్లలను హింసించి, బిక్షాటన చేయించి, బాలకార్మికులుగా మార్చినట్లు సమాచారం ఉంటే వెంటనే 1098కి కాల్ చేసి చెప్పాలని, ఆపరేషన్ ముష్కాన్‌లో భాగంగా జూలై 1 నుండి నెలాఖరు వరకు బాలల సంరక్షణకై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందు కోసం పోలీస్ టీమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, జిల్లా సంక్షేకశాఖ, విద్యాశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.